క్లుప్తంగా

వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌కు స్క్రీన్ ఏర్పాటు

సీతమ్మధార: భారత్, ఆస్ట్రేలియా మధ్య జరగనున్న వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వీక్షించేందుకు కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్‌లో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. క్రీడాభిమానులు, ప్రజలు, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మ్యాచ్ చూసేందుకు తరలిరావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పాటల పోటీలు



దేశభక్తి గీతం పాడుతున్న విద్యార్థిని

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో జీవీఎస్ఆర్ కృష్ణారావు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో 50 మంది పాల్గొన్నారు. ఉపాధ్యాయులు శశికళ, మైత్రి, యు.రాజ్యలక్ష్మి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కట్లు పంపిణీ చేశారు.

బాక్సింగ్ శిబిరం ప్రారంభం



బాక్సింగ్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సంపంగి శ్రీనివాసరావు

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీ హెచ్ స్కూల్‌లో మైక్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం బాక్సింగ్ శిక్షణ శిబిరాన్ని సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. 11 నుంచి 18 ఏళ్ల వయసు గల మగ, ఆడపిల్లలకు ఉదయం 5 నుంచి 7.30 గంటల వరకు ఉచితంగా బాక్సింగ్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 25వ వార్డు నాయకులు బొమ్మల రవి, పోతుబంతి హరికృష్ణ, బాక్సింగ్ కోచ్‌లు కుట్టు హరి, దినేష్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

హాస్యం పంచిన వినోదవల్లరి



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న క్లబ్ సభ్యులు

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో క్రియేటివ్ కామెడీ క్లబ్ ప్రత్యేక వినోద వల్లరి కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు వేముల భాస్కరాచారి ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు కామెడీ స్కిట్లు ప్రదర్శించి కడుపుబ్బా నవ్వించారు. సభ్యులు మేడా మస్తాన్ రెడ్డి, హరిప్రసాద్, దుర్గాప్రసాద్, జి.వి.త్రినాథ్, డి.ఆర్.కె.రావు, తాతాభక్తుల లక్ష్మీప్రసాద్, పంతుల లలిత ప్రదర్శించిన ఆడ నాలుక, కారువేలం పాట, మత్స్య సంప్రదాయం, సూసైడ్ వద్దురా, గొప్ప సలహా నాటికలు నవ్వులు పూయించాయి. ఈ సందర్భంగా నటరాజ నృత్యనికేతన్ చిన్నారులు జానపద నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, గ్రంథాలయ ఉద్యమకారులు వెలగా హరి సర్వోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

పనులు చకచకా..



దోబీఘాట్ వద్ద జరుగుతున్న పనులు



అంబేడ్కర్ కాలనీలో నిర్మిస్తున్న కళావేదిక

- 51వ వార్డులో అభివృద్ధి పరుగులు
- రూ.39 లక్షలతో కళావేదిక, రూ.16 లక్షలతో దోబీఘాట్ నిర్మాణం
- 600 కుటుంబాలకు ప్రయోజనకరం

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రతి ప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. తళతళలాడే రోడ్లు, కాలువలు, కల్వర్టులు, కమ్యూనిటీ హాళ్లు, ఆరోగ్య కేంద్రాలు ఇలా ఎన్నో మౌలిక వసతులకు సంబంధించి ఎటు చూసినా అభివృద్ధే కనిపిస్తోంది. ఇటీవల కాలంలో వార్డు డెవలప్‌మెంట్ పనుల్లో భాగంగా శంకుస్థాపనలు జరిగి కొన్ని నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. జీవీఎంసీ 51వ వార్డులో అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. మాధవధార దరి అంబేడ్కర్ కాలనీ 1, 2, 3, రామన్ కాలనీకి సంబంధించి కళావేదిక నిర్మాణం నాలుగు నెలలుగా కొనసాగుతోంది. రూ.39 లక్షలతో ఈ పనులు జీవీఎంసీ అధికారులు చేపట్టారు. ఇంకో నెల రోజుల్లో కళావేదిక పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. ఆయా ప్రాంతాల్లో నివసించే 500 నుంచి 600 మంది కుటుంబాలకు ఇంట్లో ఏ కార్యం చేయాలన్నా ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుంది. సుమారుగా 550 చదరపు గజాలున్న ఈ వేదికలో ఎన్నో శుభకార్యాలు చేసుకోవచ్చు. ఇంటి పరిసరాల్లోనే కళావేదిక రూపుదిద్దుకోవడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు చొరవతో వార్డు అభివృద్ధికి నోచుకుందని పలువురు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పనులను దగ్గరుండి పరిశీలిస్తున్నారని అంటున్నారు.

ఎట్టకేలకు నెరవేరిన కల

గత 25 ఏళ్లుగా తీరని తమ కల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక సాకారమైందని రజకులు ఆనందం వ్యక్తం చేశారు. హైవేపై ఆర్ అండ్ బీ జంక్షన్ దరి వెంకటేశ్వరస్వామి ఆలయం వెనుకన ఉన్న ప్రాంతంలో దాదాపు 60 రజక కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా వారికి ఓ దోబీఘాట్ కూడా కట్టి ఇవ్వలేని పరిస్థితిలో ఉండేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తీసుకెళ్లారు. ఆయన స్పందించి రజకులకు దోబీఘాట్ నిర్మించి ఇవ్వాలనే ప్రతిపాదన చేశారు. వెంటనే రూ.16 లక్షల నిధులు మంజూరు చేయించి ఆ వ్యయంతో ఈ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు పనులు కూడా మొదలయ్యాయి. మరో రెండు నెలల్లో దోబీఘాట్ వారికి అందుబాటులోకి వస్తుంది. వైఎస్ జగన్ ప్రభుత్వం తమ సమస్యను పట్టించుకుని పరిష్కరించడంతో నివాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమాజ సేవే పరమావధి



మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న చింతలపాటి సత్యదేవ్ తదితరులు

తాటిచెట్లపాలెం: నిస్వార్థంగా సమాజానికి సేవ చేయడమే జగద్గురు పీఠం(ది వరల్డ్ టీచర్ ట్రస్ట్) పరమావధని సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.శాస్త్రి అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో శనివారం నిర్వహించిన సంస్థ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన అధ్యక్షుడిగా పాల్గొని మాట్లాడారు. అక్కయ్యపాలెంలోని మాస్టర్ హోమియో వైద్యాలయంలో 40 ఏళ్లుగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బెంగుళూరు ట్రస్ట్ ప్రాంతీయ గణపతి రామ్‌ప్రసాద్ జోషి మాట్లాడుతూ మాస్టర్ ఈకే ప్రబోధించిన ఆజన్మదీక్ష సేవ, సమన్వయాత్మక యోగ జీవనానికి ఆకర్షితుడనై.. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ బెంగళూరు తపోవనం, మైసూర్‌లో ఆనందవనం అనే యోగా బృందాల ద్వారా సేవలందిస్తున్నామన్నారు. సంస్థ డైరెక్టర్ చింతపాటి సత్యదేవ్ మాట్లాడుతూ సామాన్యులకు సేవలందించాలనే మాస్టర్ ఈకే సిద్ధాంతానికి ప్రత్యక్ష నిదర్శనమే సంస్కృతి సదన్ అని పేర్కొన్నారు. ముందుగా మాస్టర్ ఈకే దంపతుల చిత్రపటానికి పూలమాల సమర్పించారు. పలు వృత్తి విద్యల్లో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు సర్టిఫికెట్లు, 18 మందికి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారు. బాలవికాస్ చిన్నారులకు సదన్ నిర్వాహకులు దాట్ల రాధ, బి.ఉషారాణి దుస్తులను బహూకరించారు. అనంతరం విష్ణుసూక్తం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డి.వి.భాస్కరరావు, హోమియో వైద్యులు డాక్టర్ జి.ఎ.రామేశ్వర్, డాక్టర్ బి.వంశీకృష్ణ, ఆయా కేంద్రాలకు చెందిన ట్రస్ట్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

వైభవ వెంకన్నకు సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేత్ర సంరక్షణపై అవగాహన

ఆరిలోవ: బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్–2 విజేత సౌజన్య భాగవతులు పాల్గొని కంటి సమస్యలు ఉన్న పిల్లలతో కలిసి కొంతసేపు సరదాగా గడిపారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్ రోడ్డులో ఖాళీ మాత విగ్రహం వద్ద నిర్వహించనున్న అవగాహన వాక్‌థాన్‌కు సంబంధించిన టీషర్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణుడు డాక్టర్ స్నేహల్ గణత్ర మాట్లాడుతూ పిల్లల కంటి సమస్యపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం పిల్లలు ప్రదర్శించిన 'నేత్ర సంరక్షణకు మంచి అలవాట్లు' అనే నాటిక అలరించింది. డాక్టర్ రామ్‌కుమార్, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు శోభారాణి, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం.. పుణ్యకార్యం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న మాలధారులు



రైల్వే న్యూకాలనీ షిర్డీసాయి ధ్యాన మందిరం వద్ద మాలధారులకు అన్నదానం(ఫైల్)

- మాలధారుల సేవలో ధ్యాన మందిరం
- వరుసగా మూడో ఏడాది అన్నప్రసాద వితరణ

తాటిచెట్లపాలెం: కార్తీక మాసం సందర్భంగా రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో మాలధారులకు అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 13 నుంచి అయ్యప్ప, భవాని తదితర మాలలు ధరించిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. 2021లో ప్రారంభించిన ఈ పుణ్యకార్యం వరుసగా మూడో ఏడాది కూడా ఘనంగా కొనసాగుతున్నట్లు ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. కార్తీక మాసంలో వివిధ మాలలు ధరించిన స్వాములకు వారికి అనుకూల రీతిలో, భక్తితో, నిష్ఠతో స్వయంగా వండి, అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు చెప్పారు. 2021లో సుమారు 63 రోజులు, 2022లో 74 రోజుల పాటు మాలధారులకు ప్రతి రోజు అన్నదానం చేశారు. ధ్యాన మందిరం వద్ద 2009లో ప్రారంభించి కొనసాగిస్తున్న అన్నసమారాధనలో వందలాది భక్తులు, పేదలు, యాచకులు పాల్గొంటున్నారు. బాబా భక్తులు, దాతల సహకారంతో ధ్యాన మందిర ప్రాంగణంలో ప్రతి రోజు మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు, గురువారాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు అన్నప్రసాద వితరణ జరుగుతోంది. నగరం నలుమూలల నుంచి అయ్యప్ప, సాయి , భవాని, శివ, కనకమహాలక్ష్మి తదితర మాలలు ధరించిన ఎవరైనా ధ్యాన మందిరంలో అన్నప్రసాదం స్వీకరించవచ్చని శేషగిరిరావు తెలిపారు.

అద్భుతం.. నృత్యరూపకం



భగీరథ విలాసం నృత్యరూపకంలో నాట్య విన్యాసం

మద్దిలపాలెం: ఆకాశ గంగను ధరిణిలోకి రప్పించడంలో భగీరథుడు ప్రయత్నం ఎలా ఫలించిందనే అపురూప నాట్య రూపాకాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. కళా సరిత్సాంగరంస గ్రంథ కర్త అయిల సోమయాజులు జోగారావు కలం నుంచి జాలువారిన భగీరథ విలాసం నృత్యనాటకానికి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి 23వ వార్షికోత్సవం సందర్భంగా ప్రదర్శించారు. వీఎండీఏ వార్షికోత్సవ సంబరాలను ఆదాయ పన్నుల శాఖ మాజీ కమిషనర్ సూదగాని రవిశంకర్ నారాయణ్ ప్రారంభించారు. కూచిపూడి డ్యాన్స్ గురువు కేవీ లక్ష్మి నిర్దేశకత్వంలో జరిగిన ఈ వేడుకల్లో తొలి ప్రదర్శనగా ప్రముఖ కూచిపూడి నాట్యకళాకారిణి సూదాగాని గీతానారాయణ్ శివరంజని రాగంలో మహేశ్వరి మహాకాళి నృత్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా కేవీ లక్ష్మి మాట్లాడుతూ వీఎండీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన విక్రమ్ గౌడ్ పాత్ర అనితర సాధ్యమని కొనియాడారు. కార్యక్రమానికి అతిథులుగా కోల్‌కతా ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బి.సత్యనారాయణ, ఆదాయ పన్నుల శాఖ (అప్పీల్స్) మనోజ్‌కుమార్, రమణమూర్తి పాల్గొన్నారు.

23 నుంచి కార్తీక ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో ఈ నెల 23 నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ తెలిపారు. ఉత్సవ కరపత్రాలను శనివారం ఆలయంలో ఆవిష్కరించారు. 23న ఏకాదశి సందర్భంగా శ్రీసీతారాముల వారికి క్షీరాభిషేకం, సహస్ర తులసీదళార్చన, 25న శనిత్రయోదశి సందర్భంగా ఉదయం 4.30 గంటల నుంచి శనీశ్వర తైలాభిషేకం, 26న చతుర్దశి, తత్కాల పౌర్ణమి సందర్భంగా ఉదయం అభిషేకాలు, సాయంత్రం 5 గంటలకు ఉమారామలింగేశ్వర స్వామి అర్ధనారీశ్వరుడి అలంకరణ, దర్శనం, 27న తెల్లవారు 4గంటలకు లలితాదేవికి క్షీరాభిషేకం, 30న తదియ, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 9 గంటలకు లక్ష మారేడు పత్రి పూజ, నవగ్రహ హోమం, డిసెంబర్ 4న శివాలయంలో మూడో సోమవారం సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు రుద్రాక్ష పూజ, మహామృత్యుంజయ హోమం, 5న సీతారాములకు సహస్ర నామార్చన, 5.30 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, 11న మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం 5 గంటలకు సామూహిక రుద్రాభిషేకం, 13న పోలి పాడ్యమి, పోలి స్వర్గం, కార్తీక దీపాలు వదులుట, సాలగ్రామ దీప, వస్త్ర స్వయంపాక దానములు చేయడం, 18న షష్ఠి సందర్భంగా శ్రీనాగబంధ సహిత సుబ్రమణ్యేశ్వరస్వామికి ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విశేష అర్చనలు, సాయంత్రం 5.30 గంటలకు శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం జరుగుతాయని చెప్పారు.

సేవా కార్యక్రమాలు



ధ్యాన మందిరంలో అన్నదానం చేస్తున్న గంట్ల శ్రీనుబాబు, ఫౌండేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం: సీనియర్ పాత్రికేయుడు పైల దివాకర్ తనయుడు పైల శివతేజ జయంతి సందర్భంగా పైల శివతేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తాటిచెట్లపాలెం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు గల అనాథలకు ఉదయం అల్పాహారం అందజేశారు. మధ్యాహ్నం రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల ధ్యాన మందిరంలో మాలధారులు, అనాథలు, పేదలకు సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు చేతుల మీదుగా అన్నదానం చేశారు. పైల దివాకర్ మాట్లాడుతూ చిన్నతనంలోనే తమ కుమారుడు మరణించి శోకసంద్రంలో ముంచాడని, దానిని మరచిపోయేందుకు పదేళ్లుగా శివతేజ జయంతి, వర్ధంతి రోజుల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన జర్నలిస్టుల పిల్లలకు శివతేజ ఎక్స్‌లెంట్ అవార్డు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు వెంకటరమణి, సంఘ సేవకులు నారా నాగేశ్వరరావు, పాత్రికేయులు ఇరోతి ఈశ్వరరావు, ఎంఎస్ఆర్ ప్రసాద్, వినోద్ కొప్పు, నిఖిల్, సుదర్శన్, సత్యమహారాణా, గాజుల ప్రసాద్, సునీల్, హరి, శ్రీనివాస్, చిరంజీవి పాల్గొన్నారు.

సిస్టర్ ఆలిస్ మేరీ అస్తమయం



సిస్టర్ ఆలిస్ మేరీ (ఫైల్)

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆలిస్ మేరీ(86) శనివారం తుది శ్వాస విడిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. దాదాపు 60 సంవత్సరాల క్రితం ఫ్రాన్స్ నుంచి భారతదేశం వచ్చిన ఆమె, విశాఖ సెయింట్ జోసెఫ్ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా చేరారు. అనంతరం ప్రధానాచార్యులుగా, కరస్పాండెంట్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా సేవలందించారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ చర్చ్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని సిస్టర్ షైజీ తెలిపారు.

భారత్ గెలవాలని విద్యార్థుల ఆకాంక్ష



ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో జెండాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతంపేట: వన్డే వరల్డ్ కప్–2023 ఫైనల్‌లో భారత క్రికెట్ జట్టు విజయం సాధించాలని అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు ఆకాంక్షించారు. శనివారం పాఠశాల గ్రౌండ్‌లో బెస్ట్ విషెస్ టు ఇండియా అంటూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ సునంద్ ఆధ్వర్యంలో విద్యార్థులు మువ్వన్నెల జెండాలు పట్టుకుని భారత జట్టుకు బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. ఈ సందర్భంగా సునంద్ మాట్లాడుతూ లీగ్ మ్యాచ్‌ల నుంచి సెమీ ఫైనల్ వరకు భారత్ జైత్ర యాత్ర కొనసాగించిందని, అదే స్ఫూర్తితో ఆదివారం అహ్మదాబాద్ మోదీ స్టేడియంలో జరగనున్న ఫైనల్స్‌లో విజేతగా నిలిచి భారతీయుల హృదయాలను కూడా గెలుచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌కు పతకాల పంట

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌కు పతకాల పంట పండింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–101 వార్షిక సమావేశం శనివారం ఎంవీపీ కాలనీలో నిర్వహించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఉత్తమ సేవలకు ప్రథమ బహుమతి, ఉత్తమ అధ్యక్షుడిగా పల్లా చంద్రమౌళి, ఉత్తమ కార్యదర్శిగా ఎల్‌వీ సుధాకర్, ఉత్తమ బులిటెన్ ఎడిటర్‌గా నిమ్మగడ్డ బుచ్చయ్య, ప్రత్యేక ప్రశంసా బహుమతి కోశాధికారి జె.కూర్మారావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావులకు ప్రకటించారు. ఆరు బహుమతులు ఒకే క్లబ్‌కు రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం. వీరికి వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర, డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అవార్డులు అందించారు. శనివారం సాయంత్రం వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అవార్డు గ్రహీతలను వాకర్స్ క్లబ్ పూర్వాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

క్లీన్ విశాఖే లక్ష్యం



మొబైల్ టాయిలెట్లు ప్రారంభిస్తున్న మేయర్

ఆరిలోవ: క్లీన్ ఆంధ్రప్రదేశ్ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. 13వ వార్డు ముడసర్లోవ ఎం.ఎస్.ఎఫ్‌లో పారిశుధ్య యంత్రాలను శనివారం కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి ఆమె ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.310.87 లక్షలు ఖర్చుచేసి బాక్ హో లోడర్లు, మినీ ఎక్స్‌కవేటర్లు, మొబైల్ టాయిలెట్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా నగరం మరింత పరిశుభ్రంగా ఉంచవచ్చన్నారు. విశాఖను చెత్త, ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిద్దిడానికి చేపడుతున్న చర్యల్లో భాగంగా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు, జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంచినట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా తగిన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200ల ఫైన్‌తో ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సమీపంలోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

జీపీఎఫ్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలి

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు జీపీఎఫ్ లోన్లు సకాలంలో మంజూరు చేసేలా తగిన చొరవ తీసుకోవాలని జెడ్పీ సీఈవో పోలినాయుడుకు పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ గోపీనాథ్ కోరారు. శనివారం జెడ్పీ సీఈవోను కలసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఇటీవల కాలంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో జీపీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలతో కొంతమంది ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో వేతనాల నుంచి మినహాయించిన డబ్బులు జమ కావటం లేదన్నారు. దీనిపై చొరవ తీసుకొని ఉపాధ్యాయులకు మేలు చేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు.అదే విధంగా పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.